# అనుభూతి

'అనుభూతంటే అనుభవం కాదు. ప్రతి మనిషి తన జీవితంలో ఎన్నో సందర్భాల్లో, ఎన్నో రకాలుగా అనుభవం సంపాదించొచ్చు. కాని అనుభూతనేది అలా కాదు. ఒకానొక సందర్భంలో, ఒకనొక చిరుసంఘటన, చిన్నమాట, వాలుచూపు ఎలైనా కావచ్చు– ఆ మనిషి జీవితాంతం గుర్తుండి పోతుంది. అదే అనుభూతి. వ్యక్తి ఎంత మొరటువడైనా, కసాయిుండెగలవడైనా వెన్నెల మరకలాంటి ఒకానొక తియ్యటి జ్ఞాపకం ఆ రాతి గుండెల వెనక నిక్షిప్తమై వుంటుంది. కాదని ఎవడైనా అంటే అది ఆత్మవంచనే అవుతుంది.

ఇది నా నమ్మకం.

కాదంటాడు నాఫ్రెండ్ కృష్ణారావు–

'ఈ అనుభూతులు, నిశ్శబ్ద జ్ఞాపకాలు ఇవన్నీ చదువుకున్న, నీలాంటి నాలాంటి వాళ్ళకి. అంతేకాని, రాళ్ళు కొట్టేవాడికి, రిక్షాతొక్కునేవాడికి అసలీ గొడవలేవుండవ్. ఇంకా చెప్పాలంటే చదువుకున్న వాళ్ళకే కొందరికి వుండక పోవచ్చు– కావాలంటే సర్వే చేసుకో నీకే తెలుస్తుంది'

ఇది వాడి వాదం

ఆ చల్లటి సాయంత్రం కాలక్షేపానికని కూర్చున్న మా ఇద్దరిమధ్యన ఈ విషయం పైన పెద్ద రాద్ధాంతమే జరిగింది అందులో రెండు పెగ్గుల విస్కీ కడుపులో వుందేమో ఇంకాస్త పంతం పెట్రేగింది.

నేనన్నాను.

"సరే ఇంతెందుకు. నువ్వేవున్నావ్– ముప్పై అయిదేళ్ళ వయసోచ్చి, ముగ్గురు పిల్లల తండ్రివయ్యావ్, ఇప్పుడు చెప్పు– నీ జీవిత కాలంలో ఇంతవరకు మనసుని కదిలించిన సంఘటనేలేదా? ఆపాటి స్పందన గూడా లేకుండానే బ్రతికేస్తున్నారా– చెప్పరా?"

వాడు నా వంక పట్టుబడ్డ దొంగలా చూసేడు. విస్కీలో లేకపోతే విసిగించే వాడేమో గాని, ఇప్పుడు మాత్రం తప్పించుకోలేకపోయేడు. తలొంచుకుని గ్లాసులో ఇంకో రౌండుకి ద్రవాన్ని పోసుకుంటూ అన్నాడు–

"నా సంగతి నీకు తెల్సుగా సెన్సిటివ్ కాదు సెంటిమెంటల్ అసలే కాదు. ఫక్తు ప్రాక్టికల్ టైప్. వుపయోగంలేందే ఏ పని చెయ్యను. కాబట్టి నాలాంటి కమర్షియల్ మనిషికి నువుచెప్పే అనుభూతులు, స్పందనలు– వగైరా గొడవలుండవ్. కాని ఒకే ఒక చిన్న సంఘటన– నే స్కూల్లో చదువుకునే రోజుల్లో జరిగింది– ఆఫ్‌కోర్సు–దీన్నే మంటారో విన్నాక నువ్వే చెప్పాలి"

నే చెప్పమన్నట్లుగా వాడివొంకే తదేకంగా చూస్తూ కూర్చుండిపోయేను వాడు గ్లాసెత్తి, ఓ గుటకేసి చెప్పసాగేడు–

"నేనప్పుడు థర్డ్‌ఫారంలో ఉన్నా వయస్సు కూడా పెద్దగాలేదు. పదమూడు– తప్పితే పద్నాలుగు– అంతే సన్నగా, పొట్టిగా, నిక్కరేసుకుని, చూడగానే పసిపిల్లాడే అభిప్రాయం కలిగించేలా వుండేవాణ్ని. మా క్లాసులోనే ఓ ఆచ్చారులపిల్ల వుండేది. పేరు రాజ్యలక్ష్మి ఎర్రగా బొద్దుగా వుండేది. కోల మొహం. పళ్ళు కాస్త ఎత్తుగావున్నా– అదేవిటో నాకు అదో అందంలా అన్పించేది. వాళ్ళ నాన్న డాక్టర్. బాగా పేరున్నవాడే. అంచేత ఖరీదైన బట్టలతో అయ్‌మీన్– పరికిని, జాకెట్టు– అంతేసుమా వేసుకొచ్చేది."

నే చాలా జాగ్రత్తాగా వింటున్నా– వాడు చెప్పబోయే విషయం కాస్త అర్థం అయినట్లనిపించింది– కాని ఆ భావం మొహంలో కనిపించకుండా జాగ్రత్తపడి బుద్ధిమంతుడైన శ్రోతలా వినసాగేను.

ప్రతిరోజు క్లాసుకి రాగానే ఆమెకోసం నా కళ్ళు వెతికేవి. కనిపిస్తే ఏవిటో పెద్ద రిలీఫ్– ఆ భావానికర్థంలేదు. ప్రేమా– అంటే అసలాగొడవేతెలీదు. ఆమె మాత్రం ఎవ్వరి వంక చూసేదికాదు. తలొంచుకుని బుద్ధిగా కూర్చునేది. అంతకంటే బుద్ధిగా రోడ్డు పైన ప్రర్తించేది.నే ప్రతిరోజూ సాయంత్రం ఆమె వెనకే. మళ్ళీ ఎవ్వరికి అనుమానం రాకుండా వెళ్ళేవాడిని. ఆవెఇంట్లోకెళ్ళాక తిరుగుముఖం పట్టేవాడ్ని"

వాడు మళ్ళీ ఇంకోగుక్కతాగి, సిగిరెట్ వెలిబించి చెప్పుకుపోతున్నాడు.

"ఇది లావుండగా, స్కూలుకి హాఫ్ఇయర్లీ పరీక్షలయిపోయి సెలవులిచ్చేరు. సెలవుల్లో ప్రతిరోజూ ఆ పిల్ల ఇంటిదాకా వెళ్ళి కిళ్ళీ షాపు వెనగ్గా చీకటిపడేవరకు నిల్చుండే దాడ్ని. ఒక్కసారూనా కనిసిస్తుందేమోనన్న ఆశ– అంతే–కాని అదేం మనిషోగాని అస్సలు బయటికి వచ్చేది కాదు. ఒక్కోసారి విసుగు చాలాసార్లు కోపంవచ్చేవి. చాలా చిత్రమైన పరిస్థితి–కాని ఒక్క విషయం– స్పష్టంగా చెపుతున్నా– అప్పటికి ప్రేమనేపదం నాకు తెలీదు సెక్స్‌పరమైన ఆలోచన్లు అసలేవుండేవికావు. కాని– అదోరకం తపన, పిచ్చి"

"నా కర్థమైందిలే చెప్పు" అన్నాన్నేను.

"సరే–సెలవులయ్యాక స్కూలు తెరిచారు మొదటిరోజు చాలా వుత్సాహంగా వెళ్ళాను. ఆమెకోసం ఎదురు చూసేను, కాని ఆమెరాలేదు. నిస్సత్తువ. నిరుత్సాహం అనిపించింది. ఆమర్నాడు, ఆపైరోజు–అప్పట్నించి వారం రోజులు–వుహు–రాలేదు. నాలోనాకే ఆదుర్దా. ఎవర్ని అడగలేని స్థితి, అలాగని వూరుకుండలేని పరిస్థితి. వెర్రిగా పిచ్చిపట్టిన వాడిలా ప్రవర్తించేను"

"ఇంతకీ వారం తర్వాతైనా వచ్చిందా?" అనడిగాన్నేను.

"వచ్చింది. కాని ఈలోపల మాక్లాసు పైకప్పుకి కొత్తతాటాకు కప్పేటందుకు రెండ్రోజులు సెలవిచ్చేరు. ఆ రెండ్రోజులుకూడా అయ్యాక మొదటిరోజు క్లాసుకెళ్లాను. ఇక్కడే జాగ్రత్తగా విను. క్లాసులోకి అడుగు పెట్టగానే, కొత్త తాటాకు వాసన గుప్పుమని కొట్టింది. కొత్తతాటాకులో విచిత్రమైన వాసనుంది, అదోరకం మాయవాసనమత్తుగా వుంటుంది. ఆకొత్త వాసనని ఆఘ్రాణిస్తూ క్లాసులోకి అడుగు పెట్టగానే ఆమె కనిపించింది. స్నేహితురాళ్ళ మధ్యగా కూర్చునుంది, పరికిణి, జాకెట్టు–ఈకాబరం కలర్‌పావడా– మునుపులేని అందాలు, పెద్దమనిషి తరహా, వికసించిన పుష్పంలా, ఎక్కుపెట్టిన బాణంలా, హరివిల్లులా–స్నేహితురాళ్ళువేస్తున్న ప్రశ్నలకి సిగ్గుపడుతూ జవాబులిస్తూ నాక్కనిపించింది–రేయ్–విస్కీతాగా చెపుతున్నా– ఆ తాటాకుల వాసన, ఆ ముగ్ధమోహన రూపం నాలో నిల్చిపోయినాయ్. ఇప్పటికి ఆ తాటాకు వాసన ముక్కుకి తాకితే, వెంటనే ఆమె గుర్తు కొస్తుంది– ఇప్పుడు ఎక్కడుందో, ఎలావుందో నాకుతెలీదు" అంటూ ముగించేడు.

గ్లాసెత్తి గటగటాతాగి నావంక చూసేడు.

"నీకు తెలుసోలేదోగాని, నువ్వాపిల్లని ప్రేమించావ్. శరీరంతో సంబంధం లేకుండా వుండేదే అసలైన ప్రేమ. నిష్కల్మషమైన ప్రేమ. తెలిసీ తెలీని చిన్న వయస్సులోనీ, లేత మనస్సుపైని పడ్డ ఆమె ప్రభావమే ఇంతకాలం గుర్తుంచుకునేలా చేసింది. ఇదీ ఇందాకనే చెప్పిన అనుభూతంటే కాని, నీ విషయంలో ప్రేమకి పెనవేసుకున్న తీపిజ్ఞాపకం కాని నా విషయంలో అలాకాదు"

"నే స్కూల్లో చదివేరోజుల్లో చాలా జులాయిగా తిరిగే వాడ్ని. స్కూలుకి చదువుకోటానికి కాక, కాలక్షేపానికో, ఆడుకోటానికో వెడుతుండేవాడ్ని. ఇంకా నాలాంటివాళ్ళే కొందరుండేవాళ్ళు. మా బ్యాచంతా వెనక బెంచీల్లోచేరి, మాష్టర్లని, ఆడపిల్లలని ఏడ్పించటం... సరే అదంతా అలావుంచు. ఒక సారి మా వూరు ప్రభుత్వ కాలేజీలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసారు. మొదటిరోజు మా సైన్స్‌టీచర్ చూసొచ్చి మమ్మల్నందర్నీ వెళ్ళమని ప్రోత్సహించేడు. విజ్ఞానం కోసం కాకపోయినా, వినోదం కోసంఆడపిల్లలకోసం మా జట్టంతా కల్సికట్టుగా వెళ్ళాం.

"తీరా అక్కడి కెళ్ళిచూస్తే మా కర్థమయ్యేవి చాలా తక్కువగా వున్నాయి. దానికి తగ్గట్టుగా ప్రతిచోట ఆడపిల్లల్ని పెట్టడం చేత అసలెవరికి బుర్రలు పన్చెయ్యలేదు. కాస్సేపు అటు ఇటూ తిరిగి గొడవ చేసి బయటికొచ్చేస్తుంటే– గుమ్మం ప్రక్కగా వున్న ఒక ఎగ్జిబిట్ మా అందరి దృష్టి నాకర్షించింది.

ఒక మీటరు పొడుగుగల తీగ రెండు బిందువుల మధ్యగాబిగించబడుంది. చూడటానికి చిన్న మోడల్ బ్రిడ్జిలాగా వుంది. ప్రక్కనే వలయాకారంలో వున్న చిన్నరింగ్ దానికో హేండిల్. మొదట్లో మాకేం అర్థం కాలేదు. కాని అక్కడున్న

ఆమె వివరంగా చెప్పింది. ఆ వలయంగా వున్న ఆ రింగుకి పొడుగ్గావున్న ఆ తీగని తాకకుండామీటరు.

పొడుగునా తీసుకెళ్ళాలి. ఒకవేళ తీగని తాకితే వెంటనే బెల్లు మ్రోగి, ఎర్రలైటు వెలిగేలా ఏర్పాటు చెయ్యబడింది.తీసుకెళ్ళిన వాళ్ళకి ప్రైజ్– మీ ఏకాగ్రతా శక్తికి ఇదోపరీక్ష అందాపిల్ల.

నాతో వచ్చిన వాళ్ళంతా ప్రయత్నించేరు. మొదట్లోనో, మధ్యలోనో, లేక చివర్లోనో అంతా ఫెయిలయ్యారు. ఇకమిగిలింది నేనొక్కడ్ని, ఆమె నా వంక ఛాలెంజీగా చూసి, ఎగతాళిగా నవ్వింది. నాలో పట్టుదల వువ్వెత్తున లేచింది. మా వాళ్ళంతా వద్దంటున్నా నేనూ ఓ టిక్కెట్టుకొని ప్రయత్నించేను. చాలా జాగ్రత్తగా, ఒక్కసారి కూడా ఆమెవంక చూడకుండా (మావాళ్ళ పాటు చాలామంది ఆమె పైని ధ్యాసతోనే ఫెయిలయినారని. అందుకే ఆమెను అక్కడ వుంచేరని తర్వాత తెల్సింది) చాలా బాలన్స్‌డ్‌గా, చివరివరకు తీగని తాకకుండా తీసుకెళ్ళాను. అప్పుడు చూసేను. ఆమె వంక!

వెడల్పయిన కళ్ళకి కాటుక పట్టించి, ఆ కాటుక కళ్ళని చిత్రంగా తిప్పి నావంక అదోలా చూసింది. ఆ చూపులో మెచ్చుకోలూ ఆప్యాయత, మిగతావారినించి వేరుచేసి చూస్తున్నట్లున్న ప్రత్యేకత ఇదీ అని నేనిప్పటికి తేల్చి చెప్పలేను కాని ఆ చూపు నా గుండెల్లోకి దూసుకొపోయింది. అప్పటికి ఇప్పటికి, ఎప్పటికి ఆ చూపు వెంటాడుతూనే వుంది. తర్వాత చాలామంది ఆడవాళ్ళని చూసేను. పెళ్ళయింది. కాని ఆ చూపునిమాత్రం మర్చిపోలేకపోతున్నాను"

ఇద్దరం బయటికొచ్చి నడుస్తుండగా క్రిష్ణారావడిగాడు.

"అవును–ఇలాంటి అనుభూతులు ఆడవాళ్ళకుండవా. సపోజ్–నీభార్య, నాభార్యేవున్నరనుకో– వాళ్ళకీ వుండాలిగా"

"ఉండితీరాలి–మన సిద్ధాంతం ప్రకారం. కాని ఆడది ప్రకృతిరీత్యా చాలా సీక్రెటివ్ టైప్–తొందరపడి మనలాగా చెప్పుకోలేరు దానికి అనేక కారణాలు. భయం, సిగ్గు–ఏదైనా కావచ్చు....

"పోనీ ఇవ్వాళ అడిగిచూడనా? అవుటాఫ్ క్యూరియాసిటి–అంతే"

"ట్రై చెయ్యి అభ్యంతరం లేకపోతే రేపు చెప్పు అన్నాన్నేను.

మర్నాడు సాయంత్రం ఇద్దరం మళ్ళీ కల్సుకున్నాం. కాఫీత్రాగేక కాస్సేపు ఆఫీసు గొడవలు చెప్పుకున్నాం తనకు తానుగా చెపుతాడేమోనని చాలాసేపుచూసేను. యిక ఉండపట్టలేక అడిగేసాను.

"రాత్రి నీ మిసెస్‌ని అడిగావా ఏవంది" అని.

క్రిష్ణారావు పకపకానవ్వి–"అన్నట్లు అడిగాను ముందు చాల్లే ఊరుకోండని కోపగించుకుంది. ఆపైన మందులో వున్నందు వల్ల మరీమరీ అడగ్గా చెప్పింది"

"ఏవని?"

"పెళ్ళికాకమునుపో, అయ్యాక మొదటి రాత్రి మోజో గుర్తు చేస్తుందనుకున్న నాకు నిరాశే అన్పించింది. మొదట్లోనీనుభూతుంటే ఎమిటని అడింది. ఓపిగ్గా. చెప్పాను. పైన చెప్పింది. మొదటి పిల్లాడు పుట్టిన రాత్రి మొదటిసారిగా, వాడినోటికి తన స్తన్యాన్నిచ్చినపుడు–వాడు తన చిరుచిగుళ్ళతో ఆకలితో, ఆర్తితో పాలుత్రాగేప్రయత్నంలో తనకి ఓ విధమైన ప్రకంపనంకలిగిందిట. మాటల్లో ఇదీ అని వర్ణించి చెప్ప లేనిదట. ఆక్షణంలో శరీరంలోని నరాలనీ జివ్వునలాగి వింత నాదాన్ని వినిపించేయిట. అదే అనుభూతిగా మిగిలిపోయందిట. ఇంకో విషయం తర్వాత మళ్ళీఇద్దరు పిల్లలు పుట్టినా తను ఆ అనుభూతిని పొందలేదట"

కాస్సేపు ఇద్దరం మాట్లాడలేదు తర్వాత క్రిష్ణారావు అన్నాడు.

"విచిత్రంగా వుంది కదూ–మనకి, వాళ్ళకి ఎంత తేడానో చూసేవా?"

"అవును–మనం వెన్నెల ననుభవిస్తూ దూరంగా వున్న చందమామను మెచ్చుకుంటాం. కాని వాళ్ళలాకాదు చందమామ లేకపోయినా వెన్నెలని సృష్టించుకుని సుఖ పడగల్రు. మళ్ళీ ఆనందాలు. అనుభూతులు అన్నీ ఒక పరిమితమైన పరిధికి లోబడే వుంటాయ్ అంటే అలా వుండాలనిరూలేం లేకపోయినా వుండేలా ప్రవర్తిస్తారు. ఒక వేళ పరిధినిదాటి ఏదైనా చిరు అనుభూతివున్నా, నీకు నాకూ కాదుగదా. సాక్షాత్తూ ఆ బ్రహ్మే దిగొచ్చినాచెప్పరు. అది ప్రకృతి సహజం.

సెంటర్లో క్రిష్ణారావు విడిపోయాడు.

నేనింటిదారి పట్టి ఆలోచిస్తున్నాను. రాత్రి జరిగిన సంభాషణ గురించి– భోజనం అయ్యేక లక్ష్మీని క్రిష్ణారావు తన భార్యనడిగినట్లే నేనూ అడిగేను. ముందుసందేహించి ఆపైన చెప్పింది.

"అనుభూతులు, అనుభవాలు నాకేంలేవుగాని, నే స్కూల్లో థర్డ్ ఫారమ్ చదివేరోజుల్లో ఓ కుర్రాడు– పాపం ఎప్పుడూ నా వంకే చూస్తుండేవాడు. నాకు జాలేసేది. ఆ అమాయక చూపులు ఇప్పటికి నాకు గుర్తుండి పోయినాయ్" అంది.

అతడి పేరు క్రిష్ణారావా నేనడగలేదు కారణం.

నా భార్య పేరు రాజ్యలక్ష్మీ కావటమే!